క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి తరలింపు



మణెమ్మను వృద్ధాశ్రమానికి తీసుకొస్తున్న సందీప్, తదితరులు

సిరిసిల్లటౌన్: వృద్ధాప్యంతో బాధపడుతున్న బీవైనగర్‌కు చెందిన ఇప్పకాయల మణెమ్మను స్థానిక కౌన్సిలర్ భర్త దార్ల సందీప్ సోమవారం వృద్ధాశ్రమానికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒంటరితనంతో బాధ పడుతున్న మణెమ్మ పరిస్థితిపై డీడబ్ల్యూవో లక్ష్మీరాజం దృష్టికి తీసుకెళ్లగా నేరెళ్లలోని ప్రభుత్వ వృద్ధాశ్రమానికి తరలించినట్లు తెలిపారు. వార్డుపెద్దలు తదితరులున్నారు.

హన్మంతరావును కలిసిన కాంగ్రెస్ నాయకులు



హన్మంతరావుతో కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావును జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ మండల నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కావాలని కోరుతూ జిగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్తున్న హనుమంతరావును కలిసి పార్టీ పరిస్థితిని వివరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, నాయకులు గౌస్, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో బోర్డు ఏర్పాటు చేయండి



బోర్డులేని లేని చింతాల్‌ఠాణా గ్రామం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చింతాల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వేములవాడ – సిరిసిల్ల ప్రధాన రహదారికి అనుకొని ఉంది. చింతాల్‌ఠాణా గ్రామం అనే బోర్డు ఎక్కడా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్సు ఆపాలన్నా బోర్డు లేకపోవడంతో ఏ గ్రామం అనేది తెలియడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇతరులు ఈ గ్రామానికి రావాలన్నా, ఏదైనా కొరియర్, పార్సిల్ లాంటి వస్తువులు గ్రామానికి ఇచ్చేందుకు వచ్చి బోర్డు లేకపోవడంతో తిరిగి వెళ్తున్నారని చెబుతున్నారు. ఏ గ్రామం అని తెలియకపోవడంతో బస్సులు కూడా ఆపడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ చౌరస్తా వద్ద గ్రామం పేరుతో బోర్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ద్విచక్రవాహనాల దొంగకు ఏడాది జైలు

సిరిసిల్లకల్చరల్: ద్విచక్రవాహనాన్ని చోరీ చేసిన మూడు కేసుల్లో ఓ వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి కావేటి సృజన సోమవార ం తీర్పు వెల్లడించారు. గత ఏప్రిల్ 2న నేరెళ్ల గ్రామానికి చెందిన మీసాల బాలరాజు తన ద్విచక్ర వాహనాన్ని సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద పార్క్ చేశాడు. కొత్త బస్టాండ్ వద్ద పార్క్ చేసిన సాయినగర్‌కు చెందిన వీరబత్తిని మహేశ్ బైక్, తంగళ్లపల్లి కి చెందిన వాసాల శివకుమార్ తన బైక్‌ను కొత్త బస్టాండ్ వద్ద పార్క్ చేశాడు. ఈ బైక్‌లన్నీ చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దొంగ ఆచూకీ కనిపెట్టారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని అజం గంజ్ ప్రాంతానికి చెందిన మలావత్ తులసీరాంగా గుర్తించారు. కేసు విచారణ అధికారి ఎస్సై శ్రీనివాస్‌రావు దాఖలు చేసిన చార్జ్‌షీట్ మేరకు న్యాయస్థానంలో విచారణ చేపట్టారు. మేజిస్ట్రేట్ ముందు నేరాన్ని అంగీకరించిన తులసీరాంకు ఏడాది జైలుతోపాటు పాటు రూ.వంద జరిమానా విధించారు.

ఇరిగేషన్ ఈఈకి ఫిర్యాదు

చందుర్తి: మండలంలోని బండపల్లి ఊర చెరువులో అక్రమంగా బోరు వేసి, బావిని తవ్వుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని వాటిని సీజ్ చేయాలని కోరుతూ ఇరిగేషన్ ఈఈ కి సోమవారం ఫిర్యాదు చేసినట్లు బండపల్లి ఎంపీటీసీ సభ్యుడు గడ్డం రణధీర్‌రెడ్డి తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు రెండో విడతలో చెరువులో ముంపునకు గురైన కి పరిహారం పొంది, మళ్లీ అదే భూమిలో బోరు వేయడంతోపాటు బావి తవ్వుతున్న గడ్డం నారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మనసంతా ఫలితాలే..!

- ఎన్నికల ఫలితాలపై ఎన్‌ఆర్‌ఐల ఆసక్తి
- వలస కార్మికుల్లోనూ ఉత్కంఠ
- ఎవరు గెలుస్తారంటూ ఆరా
- నేడు ఎన్నికల ఫలితాలు



గల్ఫ్ దేశాల్లో పనిచేసే కార్మికులు (ఫైల్)

సిరిసిల్ల: ఉపాధి వేటలో ఊరు విడిచిన వారు.. విదేశాల్లో ఉంటూ ఉద్యోగాలు చేస్తున్న వారిలో స్వదేశంలో జరిగిన ఎన్నికల ఫలితాలపై ఆసక్తి నెలకొంది. రాష్ట్రానికి చెందిన లక్షలాది మంది వివిధ దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో ఎక్కువ సంఖ్యలో ఉపాధి పొందుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. మంగళవారం ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఏ పార్టీకి ఎన్ని ఎంపీ సీట్లు వస్తాయి... ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రవాసీలు ఆరా తీస్తున్నారు. తెలంగాణలో ఉండే కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఫోన్లు చేస్తూ ఆరా తీస్తున్నారు.

ఉమ్మడి జిల్లా అంతటా వలసలే..

కరీంనగర్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గల్ఫ్ దేశాల్లో బతుకుదెరువు పొందుతున్నవారు వందలాది మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా గల్ఫ్ దేశాల్లో 1.20 లక్షల మంది ఉపాధి పొందుతుండగా వారి కుటుంబాలకు చెందిన మరో 5 లక్షల మంది ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. సిరిసిల్ల, వేములవాడ, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాలకు చెందిన వారు గల్ఫ్ దేశాల్లో అధికంగా ఉన్నారు. ఎన్నికల సమయంలో వాళ్లంతా ఓటుహక్కు వినియోగించుకోలేక పోయినా కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడుతూ ఎన్నికల సరళిపై ఆరాతీశారు. ఇప్పుడు ఫలితాలు వెలువడుతున్న తరుణంలో నియోజకవర్గాల వారీగా ఫలితాలు ఎలా ఉంటాయని ఆరా తీస్తున్నారు. ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయని తెలుసుకుంటున్నారు.

ఎన్నారై పాలసీపై ఆశలు

కేరళ తరహాలో విదేశీ విధానంపై తెలంగాణ ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని గల్ఫ్ వలసజీవులు ఆశిస్తున్నారు. నిజానికి వీసా ఉండి గల్ఫ్‌దేశాలకు వెళ్లే వారికి తక్కువ వడ్డీతో బ్యాంకు రుణవసతి కల్పించడం, గల్ఫ్ సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం, నకిలీ ఏజెంట్లను కట్టడి చేయడం, చట్టబద్ధమైన ఏజెన్సీల ద్వారా గల్ఫ్ దేశాలకు పంపడం, పొరుగు దేశాలకు వెళ్లే వారికి ఏదో ఒక రంగంలో నైపుణ్య శిక్షణ ఇవ్వడం, అక్కడి పరిస్థితులపై ముందే అవగాహన కల్పించడం వంటి విధానాలను ఎన్నారై పాలసీలో రూపొందించాలని గల్ఫ్ వలసజీవులు కోరుతున్నారు. రూ.వంద కోట్ల బడ్జెట్‌ను ఏటా కేటాయిస్తూ గల్ఫ్ వలసజీవుల ఇబ్బందులను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్‌కార్మికుల సంక్షేమంపై దృష్టిసారించగా.. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటున్నాయంటూ స్థానికంగా ఆరా తీయడం విశేషం.

ప్రపంచం అంతటా ఆసక్తి

తెలుగు రాష్ట్రాల్లోని ఎన్నికల ఫలితాలపై తెలంగాణ జిల్లాలకు చెందిన వారు ప్రపంచంలోని అన్ని దేశాల్లో ఉన్నారు. ఉన్నత చదువులు, ఉద్యోగాలు చేస్తూ అక్కడే స్థిరపడ్డ వారు ఉన్నారు. వారికి ఇక్కడి ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. తమ పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎవరు గెలుస్తారు.. మెజార్టీ ఎంత వస్తుందని ఆరా తీస్తున్నారు. ఎక్కడో ఉన్నా.. మనసంతా తెలంగాణ ఎన్నికల ఫలితాలపైనే ఉంది. విదేశాల్లో తెలంగాణ వాసులను ‘సాక్షి’ సోమవారం పలకరించగా.. వారి అభిప్రాయాలు యథాతథంగా..

నోటిఫికేషన్ వచ్చిన నుంచి చూస్తున్నాం



మాది వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేట మండలం శివంగాళపల్లె. మలేషియాలో దశాబ్దకాలంగా ఉద్యోగం చేస్తున్న. తెలంగాణలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి పరిశీలిస్తున్న. ప్రచార సభలను కూడా టీవీల్లో చూశాను. ఎగ్జిట్ పోల్స్ కూడా చూశాం. పార్లమెంట్‌కు ఎవరు వెళ్తారో అనే ఆసక్తి ఇక్కడ ఉన్న వాళ్లందరిలో ఉంది.

– శివంగాళ రమేశ్, మలేషియా

ఏ పార్టీ గెలుస్తుందోనని..



మాది సిరిసిల్ల. ఎక్కడ ఉన్నా మన దేశంలోని రాజకీయాలపై ఆసక్తి ఉంటుంది. ఇప్పుడు జరి గిన ఎన్నికల్లో ఏ పార్టీ విజ యం సాధిస్తుందోనని ఆసక్తిగా చూస్తున్నాం. సోషల్ మీడియా, వాట్సాప్‌లలో వచ్చే వాటిని చూస్తుంటాం. టీవీల్లో ఎన్నికల ప్రచారం చూస్తాం. వీకెండ్స్‌లో రాజకీయాలపై చర్చలు సాగుతాయి. ఈసారి పార్లమెంట్ ఎన్నికలు భిన్నంగా ఉన్నాయి. ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ ఉంది.

– నక్క శశికుమార్, హాంకాంగ్

గల్ఫ్ కార్మికుల బాధలు తీరాలి



మాది కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గం. గల్ఫ్ కార్మికుల బాధలు తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తుంది. గతంలో గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి ఎన్‌ఆర్‌ఐ పాలసీ తెస్తామని హామీ ఇచ్చి విస్మరించారు. గల్ఫ్ కార్పొరేషన్ లాంటివి ఏర్పాటు చేస్తామన్నారు. కానీ అమలు కాలేదు. గల్ఫ్ కార్మికులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేసే ప్రభుత్వాలు రావాలి. ఎన్నికల ఫలితాలపై ఆసక్తి ఉంది.

– ఎస్వీ రెడ్డి, దుబాయ్

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

- ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మం
- హామీలను విస్మరించిన మోదీ
- మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హన్మంతరావు



మాట్లాడుతున్న వి.హన్మంతరావు

సిరిసిల్ల: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని, నరేంద్రమోదీ వస్తే కార్పొరేట్ శక్తులకు, అగ్రకులాల వారికి మేలు జరుగుతుందని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హన్మంతరావు అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై వస్తున్న ఎగ్జిట్ పోల్స్‌ను తాము నమ్మమని ఇది మోదీ చేస్తున్న మీడియా మేనేజ్‌మెంట్ అని ఆరోపించారు. తాను బీసీనని చెప్పుకుంటున్న నరేంద్రమోదీ ఏనాడు బీసీలకు న్యాయం చేయలేదన్నారు. ఓబీసీ కన్వీనర్‌గా మూడుసార్లు మోదీని కలిసి పలు సమస్యలు వివరించినా పరిష్కరించలేదన్నారు. పదేళ్లుగా బీజేపీ ఎన్నో హామీలు ఇచ్చి విస్మరించిందన్నారు. నల్లధనం తెస్తానని, పేదల జన్‌ధన్ ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తానని చెప్పి మాట తప్పారని విమర్శించారు. ఎన్నికల ముందు ఏదో ఒక సెంట్‌మెంట్, మతపరమైన అంశాలను ప్రస్తావిస్తూ లబ్ధిపొందుతున్నారని హన్మంతరావు అన్నారు. ఈ సారి ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్‌తోనే దేశానికి మేలు జరుగుతుందన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ బీఆర్‌ఎస్‌గా మారినప్పుడే తెలంగాణ సెంటిమెంట్‌ను కేసీఆర్ పక్కన పెట్టారని, ఇక్కడ రైతులు చస్తున్నా పట్టించుకోకుండా పంజాబ్, బిహార్ వెళ్లి అక్కడి రైతులకు సాయం చేశారని హన్మంతరావు ఎద్దేవా చేశారను. ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కొండగట్టుకు వెళ్లి స్వామివారిని వేడుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నాగుల సత్యనారాయణ గౌడ్, సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజు,దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి



ఆవిర్భావ సంబరాల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు



అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీపీ, నాయకులు

తంగళ్లపల్లి: తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎంపీపీ పడిగెల మానస అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ మండల బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సిరిసిల్లలోని అమరవీరుల స్తూపానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు మోర నిర్మల, మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణా రెడ్డి, మాజీ సర్పంచ్ కోడం సంధ్యారాణి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ సద్ధ రోజ, బీఆర్‌ఎస్ నాయకులు పడిగెల రాజు, సిలివేరి చిరంజీవి, బండి జగన్, గుండు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మండల నాయకుల ఆధ్వర్యంలో..

ముస్తాబాద్ మండల బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలువేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేంద్రరావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, విజయరామారావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, సంతోష్ రావు, బాలయ్య, మల్లేశ్ యాదవ్, భరత్, నర్సయ్య, సు మతి, జానాబాయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



ఇంటింటా ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే తమ పిల్లలను చేర్పిస్తే నాణ్యమైన విద్య అందుతుందని, ఉత్తమ ఫలితాలు సాధిస్తారని కళాశాల అధ్యాపకులు ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. మండలంలోని బాకూర్‌పల్లి, తిమ్మాపూర్, రాచర్ల గొల్లపల్లి, అక్కపల్లి గ్రామాల్లో సోమవారం అధ్యాపకులు ఇంటింటికీ వెళ్లి తమ పిల్లలను సర్కార్ కళాశాలలో చేర్పించాలని కోరారు. కళాశాలలో విశాలమైన గదుల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, సాంస్కృతిక క్రీడల్లో ప్రోత్సాహం, నిష్ణాతులైన అధ్యాపకులతో విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, వాసరవేని పర్శరాములు, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, కొడిముంజ సాగర్, ప్రవల్లిక పాల్గొన్నారు.

మూసివేసిన పాఠశాలలను తెరిపించాలి

- టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్‌గౌడ్



మాట్లాడుతున్న కృష్ణ ప్రసాద్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో మూసివేసిన పాఠశాలలను తెరవాలని, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల శాఖ ఆధ్వర్యంలో టీఆర్‌టీఎఫ్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమంలోపే మూసివేసిన పాఠశాలలను తెరిపించి ఉపాధ్యాయుడిని లేదా విద్యా వలంటీర్‌ను నియమించాలన్నారు. ప్రతి పాఠశాలలో ప్రారంభానికి ముందే స్కావెంజర్ నియమించాలని, పాఠశాల నిర్వహణ గ్రాంట్ 50 శాతం జూన్‌లోనే పాఠశాలలకు కేటాయించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వెంటనే నిర్వహించాలని సూచించారు. బదిలీ అయిన రిలీవ్ కానీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి బదిలీ అయిన పాఠశాలకు పంపించాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ముత్తయ్యగారి నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి చిట్టింపల్లి బాలకిషన్, శనిగరం రామచంద్రం, శ్రీనివాస్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి



శంకరయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన మాదాసు శంకరయ్య (67) వడదెబ్బతో మృతి చెందాడు. నాయీ బ్రాహ్మణ కులానికి చెందిన శంకరయ్య తన రేకుల దుకాణంలో పనిచేస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురై ఆదివారం రాత్రి ఇంటికి చేరాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి పరామర్శించారు మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు జమున, నర్మద ఉన్నారు.

తలుపులు లేని జీపీ భవనం



తలుపులు లేని మంగళ్లపల్లి జీపీ భవనం

కోనరావుపేట: సాధారణంగా ఏ గ్రామపంచాయతీ భవనానికైనా తలుపులు, గేటు ఉంటాయి. కానీ మండలంలోమంగళ్లపల్లి గ్రామ పంచాయతీ భవనానికి కొన్నేళ్లుగా తలుపు కూడా లేకుండా పాలన సాగిస్తున్నారు. గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.13 లక్షలతో జీపీ భవనాన్ని నిర్మించగా 2016 డిసెంబర్ 3న ప్రారంభించారు. తర్వాత కొన్నిరోజులు వినియోగించకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరి, పగుళ్లు బారింది. తలుపులు చెదలుపట్టిపోయాయి. మూడేళ్ల నుంచి ఇదే భవనంలో పాలన సాగిస్తున్నారు. భవనం కూడా పగుళ్లబారుతోంది.

అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్‌లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనులను కార్యదర్శి నిలిపివేశారు. గ్రామానికి చెందిన సంతోష్ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాడు. ఇంటికి సంబంధించిన పనులను సోమవారం చేస్తున్నాడు. అయితే ఇంటి కోసం గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదు. ఈ విషయమై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో కార్యదర్శి కవిత నోటీసులు జారీచేసి పనులను నిలిపివేయించింది. అనుమతులు తీసుకున్న తర్వాతే పనులను చేపట్టాలని ఆదేశాలు జారీచేసింది.

బ్యాంకుల ముందు క్యూ..



వేములవాడ : పట్టణంలోని బ్యాంకుల వద్ద ఖాతాదారులు సోమవారం బారులుతీరారు. మొన్నటివరకు ఎండతీవ్రతకు బయటకు వచ్చేందకు జనం భయపడ్డారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వాతావరణం కాస్త చల్లబడటంతో సోమవారం బ్యాంకుల వద్ద బారులుతీరి కనిపించారు. రైతులు విద్యార్థులు వివిధ పనుల నిమిత్తం పలు గ్రామాల నుంచి బ్యాంకుల వద్ద వచ్చారు.

విద్యుత్ వైరు చోరీ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన తెలకల రాజు అనే రైతు వ్యవసాయ పొలం వద్ద గల విద్యుత్ మోటార్ వైర్‌ను సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఉదయం మోటార్ స్టార్ట్ చేయడానికి రాజు వెళ్లగా విద్యుత్ మోటార్ వైరు చోరీకి గురైనట్లు గుర్తించాడు. దీనిపై రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



ప్రయాణికులతో కిక్కిరిసిన వేములవాడ బస్టాండ్

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు సోమవారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పాఠశాలలకు సెలవులు ఉండటంతో పాటు స్వామివారిని దర్శించుకున్న భక్తులు తిరుగు ప్రయాణంలో వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో కిక్కిరిసిపోయారు. బస్సుల్లో సీట్ల కోసం పరుగులు తీశారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని బస్సులు నడిపించినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ పేర్కొన్నారు.

కంపు కొడుతోంది..



ముస్తాబాద్: మండలంలోని గూడెంలో హెల్త్ సబ్‌సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై నిర్మించిన డ్రైనేజీ కంపు కొడుతోంది. ప్రధాన రహదారి నుంచి ఆరోగ్య కేంద్రానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే కాలనీ రహదారిపై డ్రైనేజీపై పైకప్పులు వేయలేదు. దీంతో ఈ రహదారి గుండా వెళ్లేవారు డ్రైనేజీలో బండరాళ్లు వేసి అటు, ఇటు ప్రయాణం సాగిస్తున్నారు. అయితే డ్రైనేజీలో బండరాళ్లు వేయడంతో మురుగు నీరు ఇరుపక్కల నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు ఆరోగ్య కేంద్రానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రధాన డ్రైనేజీ పొడవునా ఉన్న కాలనీలకు వెళ్లే దారుల వద్ద పైకప్పులు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మూలమలుపు



కోనరావుపేట: మండలకేంద్రానికి వెళ్లేదారిలో వై జంక్షన్ వద్ద రహదారి ప్రమాదకరంగా మారింది. కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై ఏర్పడిన గుంతలో నీరు నిల్వ ఉంటుంది. ఈ రోడ్డు వద్ద ఎలాంటి సూచికలు లేకపోవడంతో నిమ్మపల్లి, సిరిసిల్ల, కోనరావుపేటకు వెళ్లే వాహనదారులు తికమకపడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతను పూడ్చి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.